క్లుప్తంగా

ఎంపీ బోస్‌ను కలిసిన చైర్‌పర్సన్

మండపేట: రాజ్యసభ సభ్యుడు, మాజీమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి మర్యాద పూర్వకంగా కలిశారు. రామచంద్రపురం నియోజకవర్గం హసనబాదలోని శనివారం ఆయన నివాసానికి ఆమె తండ్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తాడి రామారావు, కౌన్సిలర్ మండపల్లి రవి, యర్రగుంట అయ్యప్పలతో కలిసి వెళ్లి సత్కరించారు. ఈ సందర్భంగా బోస్‌తో కాసేపు ఆమె ముచ్చటించారు.

శ్రీరామారెడ్డి కుటుంబీకులకు ఎంపీ బోస్ పరామర్శ



కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

కాజులూరు: తీర్థయాత్రలకు వెళ్లి అరుణాచలంలో గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గొల్లపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మెన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి కుటుంబీకులను శనివారం రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ పరామర్శించారు. శ్రీరామారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన భార్య, కాకినాడ జిల్లా 3వ అడిషనల్ జడ్జి కోర్టు ఏపీపీ సత్తి గంగాదేవిని అరుణాచలంలో జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు జొన్నకూటి పద్మజా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు మాదిరెడ్డి పృథ్వీరాజ్, పితాని సుబ్రహ్మణ్యం, పోతు శ్రీనివాసు, మాత నూకరావు, పెట్లా శ్రీనివాసు తదితరులు శ్రీరామారెడ్డి కుటుంబీకులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ముగిసిన సప్తాహ ఉత్సవం



గంగన్న కాపు దంపతులను సత్కరిస్తున్న శిష్య బృందం

కపిలేశ్వరపురం: కోరుమిల్లి గ్రామ శివారు చిన కోరుమిల్లిలోని లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో 4వ సప్తాహ భజన కార్యక్రమం శనివారంతో ముగిసింది. సప్తాహ భజన కార్యక్రమాల నిర్వహణలో ఆరితేరిన భజన కళాకారుడు కొట్టు గంగన్నకాపు దంపతులను ఆయన శిష్య బృంద సభ్యులు సత్కరించారు. ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

కాజులూరు: రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. మండలంలోని శలపాకలో నీటి ఎద్దడి కారణంగా కాలువల నుంచి సాగునీరు అందక ఎండి పోతున్న వరి పొలాలను శనివారం మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. నీటి ఎద్దడి నేపథ్యంలో కాలువ శివారు భూములకు సాగునీరు అందించేందుకు అధికారులు వంతుల వారీ విధానాన్ని అవలంబిస్తున్నారని రైతులు సమన్వయంతో వ్యవహరించి నీటి ఎద్దడిని అధిగమించాలన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు పేపకాయల బాబ్జి, కూటమి నేతలు డాక్టర్ చంద్రు వీర్రాజు చౌదిరి, గొళ్ళ శ్రీను, వి అర్జునరావు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఆర్‌జేసీ సుబ్బారావు తదితరులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 26న నిర్వహించనున్న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు శనివారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి సమీక్ష నిర్వహించారు. ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కె.సుబ్బారావు, ఉప కమిషనర్(ఫెస్టివల్) డీఎల్‌వీ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ సత్యనారాయణలు ఆలయంలో చేయాల్సిన ఏర్పాట్లపై ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో రాణించిన విద్యార్థులు

మండపేట: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో మండపేట ఎంపీఎస్ విద్యార్థులు సత్తా చాటారు. శనివారం ముమ్మిడివరంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ విద్యార్థులు, స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. వ్యాస రచన పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన 10వ తరగతి విద్యార్థులు తలాటి హాసిని దుర్గా శివ సత్య, దుగ్గిరాల శేషశ్రీ, తోరాటి ప్రవల్లిక మాధురిలతో పాటు చిత్ర లేఖనంలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన వల్లు దేవేంద్ర నాగసాయి, షారున్ రోజా, మానేపల్లి కీర్తిలకు కలెక్టర్ బహుమతులు అందజేసినట్లు పాఠశాల సిబ్బంది మహేష్ తెలిపారు.

గ్రామీణ విద్యా కుసుమాల హవా

- పదో తరగతి ఫలితాల్లో వారిదే పైచేయి
- ప్రైవేటుగా దీటుగా అదరగొడుతున్న సర్కారు బడుల విద్యార్థులు
- 2024లో మెరుగైన ఫలితాలు
- వైఎస్సార్ సీపీ హయాంలో అద్భుత ఫలితాల సాకారం
- మార్చి 17 నుంచి పదో తరగతి పరీక్షలు



వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు

కపిలేశ్వరపురం: విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్ష ఓ మైలురాయి. ఉన్నత చదువులకు పదో తరగతి పరీక్షా ఫలితాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్యలోకి ప్రవేశించేందుకు పదో తరగతి పట్టుకొమ్మలా మారుతుంది. అంతటి ప్రాధాన్యమున్న పదో తరగతి విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలంటూ విద్యార్థులకు మేధావులు, విద్యావేత్తలు సూచిస్తుంటారు. మార్చి17 నుంచి 31 వరకూ పది పరీక్షలు జరగనున్నాయి. ఆ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. 2022–23, 2023–24 విద్యా సంవత్సరాల్లోని ఫలితాలను సమీక్షిస్తూ కథనం..

రెండు నియోజకవర్గాల్లో విద్యార్థులిలా..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 94 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 5,084 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. రామచంద్రపురం మండలంలో 32, కె.గంగవరం మండలంలో 10, మండపేట మండలంలో 28, కపిలేశ్వరపురం మండలంలో 11, రాయవరం మండలంలో 13 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో మెరుగైన ఫలితాలు..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో పదో తరగతి విద్యార్థులు ఏడాదికి ఏడాది పెరుగుతూ మెరుగైన ఫలితాలను సాధించారు. 2022–23 విద్యా సంవత్సరంతో పోల్చి చూస్తే 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అప్పటి ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేయడంతో మెరుగైన ఫలితాలు సాకారమయ్యాయి.

రామచంద్రపురం నియోజకవర్గంలో ఉత్తీర్ణత పెంపు ఇలా...

రామచంద్రపురం పట్టణంలోని 7 పాఠశాలలకు గానూ 2022–23లో 400 మంది పరీక్షలు రాయగా 228 మంది ఉత్తీర్ణులవ్వడంతో 57 శాతం నమోదైంది. 2023–24లో 391కి 314 మంది ఉత్తీర్ణులు కాగా 81 శాతం నమోదైంది. రామచంద్రపురం రూరల్ మండలంలోని ఎనిమిది పాఠశాలలకు గానూ 2022–23లో 502 మందికి గానూ 248 మంది ఉత్తీర్ణులు కావడంతో 50 శాతం నమోదైంది. 2023–24లో 533కి 450 మంది ఉత్తీర్ణులు కావడంతో 85 శాతం నమోదైంది. కాజులూరు మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2022–23లో 605 మందికి గానూ 431 మంది ఉత్తీర్ణులు కాగా 72 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023–24లో 95 శాతం నమోదైంది. కె.గంగవరం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 2022–23లో 62 శాతం ఉత్తీర్ణతా శాతం నమోదు కాగా 2023–24లో 450 మందికి 418 మంది ఉత్తీర్ణులై 93 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మండపేట నియోజకవర్గంలో ఉత్తీర్ణత పెరుగుదల ఇలా..

2022–23 విద్యా సంవత్సరం ఫలితాల్లో మండపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,130 మంది పరీక్షలు రాయగా వారిలో 1,510 మంది ఉత్తీర్ణులు కావడంతో 71 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023–24లో 2,095 మందికి గానూ 1,806 మంది ఉత్తీర్ణులు కావడంతో 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. మండపేట మండలం ప్రభుత్వ పాఠశాలల నుంచి 2022–23లో 1,015 మంది పరీక్షలు రాయగా 673 మంది ఉత్తీర్ణులయి 67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023–24లో 1,008 మంది పరీక్షలు రాయగా 817 మంది ఉత్తీర్ణులయ్యారు దీంతో 81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాయవరం మండలంలో 2022–23లో 642 మందికి గానూ 462 మంది ఉత్తీర్ణులై 71 శాతం నమోదైంది. 2023–24లో 700 మంది పరీక్షలు రాయగా 614 మంది ఉత్తీర్ణులవ్వడంతో 88 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కపిలేశ్వరపురం మండలంలోని ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 2022–23లో 473 మంది విద్యార్థులు హాజరు కాగా 349 మంది ఉత్తీర్ణులు కాగా 74 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2023–24లో 387 మందికి గానూ 375 మంది ఉత్తీర్ణత సాధించడంతో 97 శాతానికి ఉత్తీర్ణత పెరిగింది.

ప్రభుత్వ పాఠశాలల వారీగా పెరుగుదల

2022–23 విద్యా సంవత్సరంలో 83 శాతం ఫలితాన్ని సాధించిన అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల 2023–24లో నూరు శాతం ఫలితాలను సాధించింది. 2022–23 విద్యా సంవత్సరంలో టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల నూరు శాతం ఫలితాలను సాధించింది. వాకతిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాల 2022–23లో 83 శాతం సాధించగా 2023–24లో 96 శాతం ఫలితాలను సాధించింది. వల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 76 శాతం నుంచి 95 శాతానికి, మాచర 67 శాతం నుంచి 97 శాతానికి, నల్లూరు 66 శాతం నుంచి 93 శాతానికి, కపిలేశ్వరపురం 65 శాతం నుంచి 96 శాతానికి, కాలేరు జెడ్పీ ఉన్నత పాఠశాల 64 నుంచి 96 శాతానికి ఉత్తీర్ణతా శాతం పెరిగింది.

వినాయకస్వామి ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం: నేలటూరు గ్రామంలోని గణేష్ నగర్‌లో వరసిద్ధి వినాయకస్వామి ఆలయ 16వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక బృందం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఏకాదశ ద్రవ్యాలతో విశేష అభిషేకం చేశారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామంతో పాటు సమీప గ్రామాల భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ తోట



నల్లూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: నల్లూరులో భక్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం సందర్శించారు. ఆలయ ప్రతిష్ఠా పూజల్లో భాగంగా వేద పండితులు సంకల్పం, పుణ్యాహవాచనం చేశారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు దేశ సంస్కృతీ సంప్రదయాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, ఎంపీటీసీ పలివెల మధు, నాయకులు కురుపూడి రాంబాబు, అతికెల శంభులింగం, కురుపూడి శివ, ఆలయ నిర్వహణ కమిటీ నాయకులు ఉన్నారు. సోమవారం స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవం, అన్న సమారాధన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

బోస్‌కు పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ పదవిపై హర్షం



ఎంపీ బోస్, సూర్యప్రకాశ్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాజులూరు: పార్లమెంట్ ఫ్లోర్ లీడర్‌గా నియమితులైన స్థానిక నాయకులు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. శనివారం జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఒంటితాడి సర్పంచ్ నెల్లి బ్రహ్మాజీ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పితాని సుబ్రహ్మణ్యం, దంగేటి వెంకన్న, పెంకే వెంకటరమణ, టేకుమూడి శంకర్, నున్న లక్ష్మణరావు, చప్పిడి విజయ్‌కుమార్ తదితరులు పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగ అధ్యక్షునిగా నియమితులైన బోస్ తనయుడు, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాశ్‌ను మండల గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్కరించి అభినందించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

మండపేట: జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం (ఎన్‌ఎంఎంఎస్) నిర్వహించిన పరీక్షల్లో మండలంలోని వెలగతోడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు.

ఈ పరీక్షల్లో పాదిలాపు ప్రణవి, శొంఠేణి సుప్రజ రమణి, వానపల్లి ఈశ్వర వరప్రసాద్, షేక్ అబ్దుర్‌నజీర్, కాసాని వెంకట సుబాష్‌లు ఉత్తమ ప్రతిభతో ఉత్తీర్ణులయ్యారని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వీరికి ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందివ్వడం జరుగుతుందన్నారు. ఇలా 4 సంవత్సరాల పాటు విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తుందని చెప్పారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

రాయవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికేట్(ఎన్‌ఎంఎంఎస్)కు మండలంలోని వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం పోలిశెట్టి రాంబాబు శనివారం విలేకరులకు తెలిపారు. ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో పాఠశాలకు చెందిన ఎ.యశ్వంత్‌కుమార్, ఎస్.శరణ్య సత్య సంతోషిణి, వి.ఆర్య సుబ్రహ్మణ్యం అర్హత సాధించి, స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారన్నారు. వారికి శిక్షణనిచ్చిన గణిత ఉపాధ్యాయురాలు డి.బుల్లికుమారి, హెచ్‌ఎం రాంబాబును రామచంద్రపురం డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎంఈవో–2 వై.సూర్యనారాయణ, సర్పంచ్ పెద్దబ్బాయ్ తదితరులు అభినందించారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



హోమియో మందు వేస్తున్న ట్రస్టు మహిళా విభాగం చైర్‌పర్సన్ శ్రీదేవి

మండపేట: అర్తమూరులో శనివారం ఎస్వీఎస్సార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యం శిబిరం జరిగింది. ట్రస్టు మహిళా విభాగం చైర్‌పర్సన్ సత్తి శ్రీదేవి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. రాజమండ్రి అల్లు రామలింగయ్య హోమియో ఆసుపత్రి వైద్యులు కే సాయిసుధ, డి అమృత, కే ఐశ్వర్య, వీరభద్రరావు హాజరై వైద్యసేవలు అందించారు. రోగులకు బీపీ, షుగర్, కాళ్ల వాపులు, నొప్పులను పరీక్షించి ఉచిత హోమియో మందు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులకు హోమియో వైద్యం అద్భుతంగా పని చేస్తుందన్నారు. దీనివల్ల శరీరానికి దుష్ప్రభావం ఉండదన్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన 250 మంది వైద్య సేవలు పొందినట్టు తెలిపారు. కార్యక్రమంలో అనపర్తి డాక్టర్ సుమమాధురి, ట్రస్టు సభ్యులు కర్రి సుజాత, తాడి సుబ్బిరెడ్డి, ఓగిరెడ్డి రామారెడ్డి, తాడి శ్రీనివాస్ రెడ్డి, చిర్ల రామకృష్ణారెడ్డి, ఎస్వీవీ సత్యనారాయణరెడ్డి, కేబీఎస్ఎన్ రాజు, వెలగల శివారెడ్డి, ఉద్దగిరి ఆంజనేయులు, జీవీఎస్ఎన్ మూర్తి, తాడి రామారెడ్డి, కొవ్వూరి గంగిరెడ్డి, సీహెచ్ వెంకటరెడ్డి, హేమలత, నాగరత్నం, అప్పలరాజు పాల్గొన్నారు.

స్వచ్ఛ సమాజ సాకారమే లక్ష్యం



మండపేటలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

మండపేట: మండపేట పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సంకల్పించిన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ టీవీ రంగారావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రను పురస్కరించుకుని శనివారం కమిషనర్ ఆధ్వర్యంలో పట్టణంలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ, మెప్మా, పురపాలక సంఘ సిబ్బందితో ఆయన కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. చీపుర్లు చేతబట్టి మెయిన్‌రోడ్డు కలువపువ్వు సెంటర్‌ను ఊడ్చారు. కార్యక్రమంలో డీఈఈ కే శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్, ఆర్ఐలు ఏజీఎస్ శ్రీనివాస్, ఉప్పల శ్రీనివాస్, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, సీఈవోలు బీ వీరలక్ష్మి, ఎం మహాలక్ష్మి, కార్యాలయ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం



ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ప్రకటించిన ఉత్తమ సేవా పురస్కారాలను పొందిన రామచంద్రపురం డివిజినల్ వైద్య ఆరోగ్య శాఖాధికారి, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎన్. ప్రశాంతి, తోటపేట ఏఎన్‌ఎం సుబ్బలక్ష్మి, ద్రాక్షారామ ఆశా వర్కర్ సుజాతలను ద్రాక్షారామ పీహెచ్‌సీలో శనివారం ఘనంగా సత్కరించారు. వక్తలు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సందీప్‌నాయుడు, సీహెచ్‌ఓ యు.వీరవేణి, పీహెచ్‌ఎన్ జానకమ్మ, ఎంపీహెచ్‌ఎస్ వరలక్ష్మి, యూడీసీ రాణి, ఎంపీహెచ్‌ఎస్ కె.గోవిందబాబు, విఠల్ మాస్టారు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాయవరం: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రశాంతంగా ముగిశాయి. స్కూల్ కాంప్లెక్స్‌ల రీ ఆర్గనైజేషన్ అనంతరం ఏర్పాటైన 87 స్కూల్ కాంప్లెక్స్‌ల్లో ఈ సమావేశాలను నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1,582 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 5,430 మంది వరకు ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న 1,2 తరగతుల ఉపాధ్యాయులకు, 3,4,5 తరగతుల ఉపాధ్యాయులకు వేర్వేరుగా తరగతులు నిర్వహించారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు వేర్వేరు తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల సాయంతో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా అయినవిల్లి మండలం జెడ్పీహెచ్ఎస్ సిరిపల్లి కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. అలాగే సమగ్ర శిక్షా సెక్టోరల్ అధికారులు, అమలాపురం, రామచంద్రపురం డీవైఈవోలు జి.సూర్యప్రకాశం, పి.రామలక్ష్మణమూర్తి, మండల విద్యాశాఖాధికారులు ఆయా మండలాల్లోని కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కాజులూరు: మండలంలోని శలపాక గ్రామానికి చెందిన యువతి సిద్దాబత్తుల దయామణి కనిపించడం లేదని ఆమె తల్లి లోవకుమారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ శనివారం తెలిపారు. యువతి ఈ నెల 14 నుంచి కనిపించడం లేదని పరిసర గ్రామాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆమె తల్లి పోలీసులకు సమాచారం ఇచ్చింది. యువతి ఆచూకీ తెలిస్తే గొల్లపాలెం స్టేషన్‌లో సమాచారం ఇవ్వాల్సిందిగా ఎస్సై కోరారు.

విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ దొరరాజు, ఎస్ఐ బుజ్జిబాబు

మండపేట: విద్యుత్ షాక్‌తో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని ద్వారపూడిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ పీ బుజ్జిబాబు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి నుంచి ద్వారపూడి శివారు వేములపల్లిలోని గోదావరి ఎడిబుల్ కంపెనీ వద్దకు చిటికెన రామకృష్ణ లారీ లోడుతో శనివారం వచ్చారు. కంపెనీ ఎదురుగా లారీ పార్క్ చేసి శుభ్రం చేద్దామని లారీ కేబిన్‌పైకి ఎక్కాడు. లారీ పైభాగంలో విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రమాదవశాత్తూ ఆ వైర్లు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. ఘటనా స్థలానికి రూరల్ సీఐ పీ దొరరాజు చేరుకుని పరిశీలించారు. సీఐ సూచనల మేరకు ఎస్ఐ బుజ్జిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మెగా పశువైద్య శిబిరం



పాడి రైతులకు మందులు అందజేస్తున్న ప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం తాళ్లపొలం శివారు నవరత్నాల గరువు గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఓ.రామకృష్ణ పాడి రైతులకు పశువులకు సోకే వివిధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారులు డాక్టర్ పి రామచంద్రరావు, మేడిశెట్టి కృష్ణార్జున, డాక్టర్ భావన జ్యోతి, డాక్టర్ ఎం.బిందు, డాక్టర్ విజయదుర్గ, పశు వైద్య సిబ్బంది కలిసి 128 పశువులకు వైద్య సేవలు అందించారు. అనంతరం 286 పాడి పశువులకు అవసరమైన కాల్షియం, మినరల్ మిక్చర్, లివర్ టానిక్, డీవార్మింగ్ తదితర మందులను అందజేశారు. ఎస్ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ ముంబై హెడ్ ఆఫీస్ ప్రతినిధి పి. వెంకటాచలం, ఏఎస్ మురళీకృష్ణన్, స్టేట్ మేనేజర్ కె. బాలబాలాజీ, క్లస్టర్ మేనేజర్‌లు కె. శ్రీనివాస్, టి. శ్రీనివాస్, ఈఎస్ఎం మేనేజర్ రవీంద్ర, హెచ్‌ఆర్ మేనేజర్ టి. రాజు, రామచంద్రపురం బ్రాంచ్ మేనేజర్ కె. శివ రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో తాళ్లపొలం, ఉట్రుమిల్లి, నవరత్నాలగరువు, అడపావారి సావరం, చిన్న తాళ్లపొలం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

అయినవిల్లి: ఉపాధ్యాయులు మెరుగైన బోధనా పద్ధతులను అలవర్చుకుని, విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీంబాషా తెలిపారు. శనివారం ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన క్లస్టర్ స్థాయి ఉపాధ్యాయ సమావేశాలను ఆయన ప్రారంభించారు. డీఈఓ షేక్ సలీంబాషా మాట్లాడుతూ ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతులు అలవరచుకొని మెరుగైన బోధన చేయాలన్నారు. సీ, డీ గ్రేడు విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహించాలని ఆయన కోరారు. పాఠశాల వారీగా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఫలితాల సాధనకి కృషి చేయాలని కోరారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిరిపల్లిలో క్లస్టర్ మూడు హైస్కూల్స్, 15 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. సిలబస్‌పై ఆయన చర్చించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి.శ్రీనివాస్, క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మకాయల గణేశ్వరరావు, విలస, మాగాం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పీవీ రవి ప్రసాద్, వి.శరభరాజు, రిసోర్సు పర్సన్స్ జి.సాయి శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరావు, డి.సత్యనారాయణ, ఎ.కొండలరావులు, డి.వి.విరామకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

రావులపాలెం: వెదిరేశ్వరం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం క్లస్టర్ పరిధిలోని టీచర్లకు బోధనా అంశాలపై శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంఈఓలు నాగకుమార్, శ్రీనివాసరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనా అంశాలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించవచ్చని సూచించారు. ఈ శిబిరంలో సుమారు 70 మంది టీచర్లకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.